# మీకు తెలుసా?

## గతం - ప్రస్తుతం

గతానికి ప్రస్తుతానికి తేడా ఏమిటి? అది అప్రస్తుతమని అనుకోకండి. ఎందుకంటే మన వ్యాసానికి అదే ఆధారము కనుక. ఇంతకీ ఏమంటారు? శబ్దవేగాన్ని అధిగమించే ప్రయత్నము, కొత్త కొత్త విద్యుత్, విద్యుదయస్కాంత పరికరాలను కనుగొనడము, పరమాణువు నిర్మాణము తెలుసుకొని, పరమాణుశక్తిని అంచనా వేయడము, మానవ జీన్స్‌పై ప్రయోగాలు అని అంటారు కదూ! కాని ఇవి రామాయణ భారతకాలములలోనూ వివిధ సందర్భములలో మనకు కనిపిస్తాయి. 'నిప్పులేనిదే పొగరాదు' అనే సిద్ధాంతాన్ని నమ్మితే మన పురాణాలలో, రామాయణ, మహాభారతములలో కనిపించే ఎన్నో విశేషాలు మనల్ని ఆశ్చర్యచకితులను చేస్తాయి.

ఉదాహరణకు మన పురాణాలలో పుష్పక విమానము ప్రస్తావన వుంది. దాని వర్ణన చూస్తే, అది నేటి బోయింగ్ తోనో, అంతకంటే విశేషముగా నిర్మించిన విమానముతోనో పోల్చుకోవచ్చు. పుష్పక విమానానికి చోదకుడు ఉన్నట్లు చాలా సందర్భాలలో వినలేదు. అది ఆజ్ఞలతోనే నడుస్తుంది అన్నట్లు విన్నాం. అంటే Voice recognition, Voice Command interpreter అనే పద్ధతులు ఇది వరకే వాడారని అనుకోవచ్చు. ఇకపోతే నాటి వరుణాస్త్రము - నేటి మేఘమదనానికి, నాటి ఆగ్నేయాస్త్రము - నేటి missileకి, నాటి సమ్మోహనాస్త్రము - నేటి బాష్పవాయు ప్రయోగానికి పోలికలు కనిపిస్తాయి. నేటి మానవునికి వాయువును నియంత్రించడము సాధ్యము కాదు. కాని నాడు వాయువ్యాస్త్రాన్ని ప్రయోగించినట్లు మనము చదువుకున్నాము. ఇక పోతే నాటి తిరుగులేని అస్త్రము బ్రహ్మాస్త్రము - నేటి న్యూక్లియర్ missiles కి సాటి కాదనగలమా? నేడు భూగర్భజలాలను కనుగోడానికి బోరింగ్ యంత్రాలు - నాడు భూగర్భజలాలను రప్పించడానికి ఉపయోగించిన అస్త్రములకు నకలేమో అని అనిపిస్తుంది.

ప్రపంచములో పలు దేశాలు కళ్ళు తెరవక ముందే భారతీయ శాస్త్రవేత్తలు గ్రహాంతర దూరాలను కొలిచే పద్ధతులను, సౌరమాన, చాంద్రమాన పట్టికలను, గ్రహణములు ఎప్పుడు వచ్చేదీ గణన చేయడము, సౌర కుటుంబములోని గ్రహముల గతి, వాటి కక్ష్యలను, జ్యోతిష శాస్త్రము, సంఖ్యాశాస్త్రము మొదలైన విషయములలో విశేష ప్రజ్ఞను కనబరిచారు. మన వేదములలో ఎన్నో గణిత సూత్రములు అంతర్లీనముగా ఉన్నాయి. ఒక భిన్నము విలువను వంద దశాంశములకు సవరించడానికి సులువైన సూత్రములను మన పూర్వులు ఉపయోగించారు. మన గొప్పదనాన్ని వేరొకరు గుర్తిస్తే తప్ప తెలుసుకోలేని స్థితిలో మనమున్నాము. మనము పాశ్చాత్య దేశాల ఆమోద ముద్ర పడితేగాని మనము దేనిని అంగీకరించము. పసుపు చర్మ సౌందర్యానికి మంచిది అని మన పెద్దలు చెబితే అది వెగటు. అదే ఏ పాశ్చాత్య శాస్త్రజ్ఞుడో చెబితే అది వేదం. మన పూర్వులు తీతువు పిట్ట అరిస్తే అరిష్టము అన్నారు. అది మూఢనమ్మకమని కొట్టిపారేశాం. కాని ఓ శాస్త్రవేత్త దానిని ధృవీకరిస్తూ, ఓ ప్రాణి తుది శ్వాస విడిచే ముందుగా వదిలే కొన్ని వాయువులను ఆ పిట్ట గ్రహించగలదని, అందుకే ఆ సమయానికి అది అక్కడికి చేరుకుంటుందని సెలవిచ్చాడు. గ్రహణ సమయములో మన పెద్దలు సూచించిన జాగ్రత్తలను నేటి శాస్త్రవేత్తలు కూడా ధృవీకరిస్తున్నారు. అంతరిక్షములో విశ్వామిత్రుడు ఓ లోకాన్ని ఏర్పరచినట్లు, దానిని త్రిశంకు స్వర్గము అంటారని మనము విన్నాము. నేటి Space Centers, నాటి త్రిశంకు స్వర్గానికి ప్రతిరూపములనిపించడము లేదా?

భారతములో మనము విన్న మయసభ నేడు 'మిస్టరీ హౌస్' లుగా పిలువబడుతున్న కట్టడాలకు భిన్నమేమీ కాదు. నాడు కౌరవుల జననానికి వ్యాసమహర్షి ఉపయోగించినది నేటి టెస్టుట్యూబ్ బేబీ టెక్నాలజీ అని మనము అనుకోవచ్చు. గాంధారి, కుంతీదేవి కంటే ముందు ప్రసవించలేదని, అసూయకు లోనై గర్భస్రావము గావించుకోబోతే, వ్యాసుడు ఆమె గర్భాన్ని సంరక్షించేందుకు, నూరు కుండలలో అండాన్ని విభజించి దుర్యోధనాది కౌరవజననానికి కారకుడయ్యాడు. నాటి ద్వారకను, ఈ మధ్య కాలములో నీటి అడుగున గుర్తించినట్లు వచ్చిన వార్తలు మనకు ఆశ్చర్యము కలిగిస్తాయి. రామాయణ కాలములో నీటిపై తేలే వంతెన గురించి విన్నాము. ఈనాడు హార్బరులలో నిర్మించే ప్లాట్ ఫారములు నీటిపై తేలే విధముగా నిర్మించడము మనకు పరిచయమే! ఢిల్లీ, రాజస్థాన్ మొదలైన ప్రదేశాలలో నిర్మించిన జంతర్ మంతర్ లోని నిర్మాణాలు రోజులో సమయము తెలుసుకోడానికి, అదీ ఉత్తరాయణములోనూ, దక్షిణాయణములోనూ సమయము ఖచ్చితముగా తెలుసుకోవడానికి పరికరాలను నిర్మించిన మన పూర్వీకుల మేధస్సును మనము హర్షించి తీరవలసిందే. నేడు హ్యూమన్ కంప్యూటర్ గా సుప్రసిద్ధమైన శకుంతలాదేవి, శ్రీనివాసరామానుజన్, జగదీశ్ చంద్రబోస్, సి.వి.రామన్, హరిగోవింద ఖరోనా వంటి మహోన్నత వ్యక్తులకు జన్మనిచ్చిన భూమి మనది. వైద్యులకు గురువు ధన్వంతరి, జ్యోతిష శాస్త్రములో వరహామిహిరుడు, గణిత శాస్త్రజ్ఞులు భాస్కరుడు, ఆర్యభట్ట మొదలైన వారి గురించి ఎంత చెప్పినా అది తక్కువే. మన పురాణాలు, కావ్యాలు అంతా కల్పితమని కొట్టిపారేయడము ఎంతమాత్రమూ తగదు.